క్లుప్తంగా

ఎర్రవరం ఆలయాన్ని సందర్శించిన ఏపీ ఎమ్మెల్యే


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి దంపతులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరంలో గల దూళ్లగుట్ట బాల ఉగ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ లోని నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇనుపకుతికెల లక్ష్మీనరసింహమూర్తి వారితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తక్కువ సమయంలో తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన ఆలయాల్లో ఒకటిగా నిలవడం ఈ ప్రాంత ప్రజలకు వరమని అన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకరిస్తానని తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న బుచ్చిపాపయ్య

మునగాల : మండలంలోని తాడువాయిలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 20 కుటుంబాల వారు సోమవారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చిట్యాల లింగయ్య, లొడంగి సాయి, దాసరి హుస్సేన్, కుంభం అనీల్, కుంభం నాగరాజు, బోడయ్య, సందీప్, నాగయ్య, లింగయ్య, ఉపేందర్, మల్లయ్య, వీరబాబు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు దేవరం సుధీర్‌రెడ్డి, కారింగుల వెంకన్న, బాలకృష్ణ, వీరయ్య, సాయికుమార్, వీరబాబు, రామకృష్ణ, కృష్ణయ్య పాల్గొన్నారు.

సీసీ ఫ్లోరింగ్ నిర్మాణ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న రామచంద్రయ్య

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో గల ఈద్గా వద్ద ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేసిన రూ.8లక్షల నిధులతో సీసీ ఫ్లోరింగ్ నిర్మాణ పనులను సోమవారం ముస్లిం పెద్దలతో కలిసి మండల పీఏసీఎస్ చైర్మన్ జువ్వాజి రామచంద్రయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కూరాకుల చెన్నయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు నిజాముద్దీన్, కాంగ్రెస్ మైనార్టీసెల్ మండల అధ్యక్షుడు ముత్యాలంపాటి నాగుల్‌మీరా, రవీందర్‌రెడ్డి, నరసింహారావు, ఖాజావలీ, సైదా, అక్బర్, జాన్‌బాబా, తదితరులు పాల్గొన్నారు.

19న సీఐటీయూ వర్క్‌షాపు

నేరేడుచర్ల : సూర్యాపేటలో ఈనెల 19వ తేదీన జరిగే సీఐటీయూ జిల్లా స్థాయి వర్క్‌షాపును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు కోరారు. సోమవారం నేరేడుచర్లలో జరిగిన సీఐటీయూ మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్‌లు రామ్మూర్తి, యాకుబ్, ఎడ్ల సైదులు, కోదాటి సైదులు, అశోక్ తదితరులు ఉన్నారు.

బ్యాంకింగ్ రెగ్యులేషన్ సవరణ చట్టం -2020 రద్దు చేయాలి

చిలుకూరు: బ్యాంకింగ్ రెగ్యులేషన్ సవరణ చట్టం 2020లోని సెక్షన్12 (1) ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య మాట్లాడుతూ సహకార సంఘాల్లో కార్పొరేట్ సంస్థలకు, బడా పెట్టుబడిదారులకు సభ్యత్వం ఇవ్వవద్దని అన్నారు. అనంతరం తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. నాయకులు బాలేబోయిన రవి, యరగాని నాగయ్య, సైదులు, లక్ష్మి, సరోజన పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హుజూర్‌నగర్ : హుజుర్‌నగర్ పట్టణ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఏపీలోని నంద్యాల జిల్లా డోన్ మండలం బేతంచెర్ల సిమెంట్ నగర్‌కు చెందిన ఎం. పరుశురాములు.. పట్టణ శివారులో తన లారీ టైర్ పగలడంతో టైరు మార్చుకుంటున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి మరో లారీ వచ్చి ఢీకొట్టడంతో రెండు లారీల క్లీనర్లకు గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం సూర్యాపేట తరలించారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభించేదెప్పుడో..

- 190 సర్వే నంబర్‌లోని భూములకు నీరందించేందుకు ప్రభుత్వం చర్యలు
- ఆర్–9 లిఫ్ట్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు
- మూడేళ్ల క్రితం వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం కేసీఆర్
- నేటికీ ప్రారంభం కాని పనులు
- సాగునీటి కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులు


ఎకలాస్‌ఖాన్‌పేట తండా సమీపంలో బీళ్లుగా ఉన్న భూములు


రామాపురం వద్ద..

నడిగూడెం : సాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న ఆర్–9 ఎత్తిపోతల పథకం నుంచి మండలంలోని రామాపురం రెవెన్యూ పరిధిలోని 190 సర్వే నంబర్‌లో గల 1200 ఎకరాల భూములకు ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా నీరందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీంతో హాలియా వద్ద నెల్లికుదురు నుంచి సీఎం కేసీఆర్ వర్చువల్‌గా పైప్‌లైన్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన కూడా చేశారు. అయితే నిధులు మంజూరై, పనులకు శంకుస్థాపన చేసి మూడేళ్లు కావొస్తోంది. నేటికీ పనులు ప్రారంభం కాలేదు.

రూ.8.50 కోట్లు మంజూరు

కాగా, 190 సర్వే నంబరులో దాదాపు 1200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని గతంలో రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్‌పేట తండా, తెల్లబల్లి, మునగాల మండలం కృష్ణానగర్, బరాఖత్‌గూడెం, ముకుందాపురం, ఆకుపాముల, కోదండరామాపురం గ్రామాల్లో నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున పంపిణీ చేసి పట్టాలు అందజేశారు. దీంతో రైతులు ఆ భూమిని ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నారు. చెంతనే సాగర్ కాల్వ ఉన్న వరి సాగుకు నీరు రాకపోవడంతో మెట్ట పంటలైన కంది, పెసర, వేరుశనగ, జొన్న, పత్తి, తదితర పంటలను సాగు చేసుకుంటున్నారు. వరి సాగుకు నీరందించాలని రైతులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. దీంతో స్పందించిన ప్రభుత్వం ప్రత్యేక పైపులైన్ నిర్మాణానికి రూ.8.50 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి అయింది.

పైపులైన్ నిర్మాణం ఇలా..

సాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న ఆర్–9 ఎత్తిపోతల పథకం నుంచి ప్రత్యేక మోటారు ద్వారా 7.5 కిలోమీటర్ల దూరం పైపులైన్ నిర్మాణం చేపట్టి చివరి భూములకు సాగు నీరు అందించాలనేది లక్ష్యం. భూముల మధ్యలో రామాపురం శివారులో ఉన్న కుంటకు సైతం పైపులైన్ ద్వారా సాగు నీరు అందించి, చివరి భూములకు అక్కడి నుంచి పంట కాల్వల ద్వారా సాగు నీరు అందించాలని అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు.

వర్షాధార పంటలు సాగు చేస్తున్నాం



మా గ్రామానికి చెంతనే సాగర్ ఎడమ కాల్వ ఉన్నా మా భూములకు చుక్క సాగు నీరు అందడం లేదు. దీంతో వర్షాధార పంటలు సాగు చేసుకుంటున్నాం. రబీ సీజన్‌లో భూములు బీళ్లుగానే ఉంటున్నాయి. ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేసి సాగు నీరు అందిస్తే మా భూముల్లో సిరులు పండిస్తాం.

– ధరావత్ శ్రీనునాయక్, ఎకలాస్‌ఖాన్‌పేటతండా

సాగు నీరు అందించాలి



మా గ్రామ పరిధిలోని 190 సర్వే భూములకు సాగు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. దీంతో సాగు నీటి కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం. నీటి పారుదల శాఖ అధికారులు ప్రత్యేక పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేసి, సాగు నీరు అందించాలి.

– ఏనుగుల వీరాంజనేయులు, రైతు, రామాపురం

అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం

సిమెంట్ పైపులైన్ ఏర్పాటు చేసుకుందుకు 7.5 కిలో మీటర్ల మేర ప్రతిపాదించాం. కానీ భవిష్యత్తులో నీటి ఒత్తిడికి సిమెంట్ పైపులైన్‌లు దెబ్బతిని, లీకయ్యే అవకాశముంటుందని, ఇనుప పైపుల ఏర్పాటు కోసం రూ.13.50 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పైపులైన్ పనులు ప్రారంభిస్తాం.

– జి.సత్యనారాయణ, ఈఈ, నీటి పారుదల శాఖ

మునగాల పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మునగాల : విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం, ఉన్నతాధికారులతో దురుసుగా ప్రవర్తించిన మునగాల గ్రామపంచాయతీ కార్యదర్శి కె.శ్వేతను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎస్.వెంకట్రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. మండల కేంద్రంలో ఈనెల 14వ తేదీన నిర్వహించిన మొక్కలను రక్షించే వారోత్సవాలకు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పరిషత్ సీఈఓ సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాగా సదరు కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి ఆలస్యంగా వచ్చారు. దీంతో సీఈఓ సదరు కార్యదర్శిని ప్రశ్నించగా తనకు ముందస్తుగా ఎలాంటి సమాచారం లేదని ధిక్కార స్వరంతో సమాధానం ఇచ్చారు. కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ కార్యక్రమం పట్ల నిర్లక్ష్యం వ్యవహరించడమే కాక, దురుసుగా ప్రవర్తించిన కార్యదర్శి శ్వేతపై జిల్లా కలెక్టర్‌కు సీఈఓ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ స్పందించి జూనియర్ పంచాయతీగా విధులు నిర్వర్తిస్తున్న శ్వేతను సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఉత్తర్వులను సోమవారం పంచాయతీ కార్యదర్శికి అందజేసినట్లు మండల పంచాయతీ అధికారి భూపాల్‌రెడ్డి తెలిపారు. కాగా బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు మునగాల గ్రామపంచాయతీకి ఇన్‌చార్జ్‌గా నియమిస్తున్నట్లు భూపాల్‌రెడ్డి తెలిపారు.

తెలంగాణలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది

- కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

హుజూర్‌నగర్: తెలంగాణలో తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరిగిపోయిందని కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో నియోజకవర్గ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేసేందుకు బీజేపీ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్‌రెడ్డి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గట్టు శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాల వెంకటేశ్వర్లు, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ మధుకర్ జీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్, జిల్లా అధికార ప్రతినిధి పత్తిపాటి విజయ్, అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్ రెడ్డి, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడుల్లో ఇద్దరి అరెస్ట్


పట్టుబడ్డ నిందితులు, ఆటో, బెల్లంతో అధికారులు

హుజూర్‌నగర్ : సారా తయారీకి బెల్లం సరఫరా చేస్తున్న ఇరువురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలంలోని పలు తండాలకు షేక్ మౌలానాకు చెందిన ఆటోలో బెల్లం తరలిస్తున్న నేరేడుచర్లకు చెందిన నాగమళ్ల అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిని ప్రశ్నించగా మక్కెన రాంబాబుతో కలిసి హైదరాబాద్ నుంచి బెల్లం తెప్పించి పలు తండాలకు సరఫరా చేస్తున్నట్లు అంగీకరించాడు. రాంబాబు ఇచ్చిన సమాచారంతో గోడౌన్‌లో ఉన్న 35 కాటన్ల బెల్లం, ఆటోలో తరలిస్తున్న 5 కాటన్ల బెల్లం కలిపి మొత్తం 800 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా మఠంపల్లి మండలంలోని సాగర్ సిమెంట్ వద్ద బెల్ట్‌షాపు నిర్వాహకుడు సకుల్ వద్ద నుంచి 20 లిక్కర్ సీసాలతో పాటు 4 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు జగన్ మోహన్‌రెడ్డి, వెంకన్న సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా తయారీ స్థావరాలపై పోలీసుల దాడులు

- 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- 5 లీటర్ల నాటుసారా స్వాధీనం

మఠంపల్లి: మండలంలోని కొత్తతండా శివారులో నాటుసారా తయారుచేస్తున్న భట్టీలను సోమవారం మఠంపల్లి ఎస్‌ఐ సీహెచ్. బాలకృష్ణ తన పోలీసు సిబ్బందితో కలిసి వెళ్లి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మఠంపల్లి మండలంలోని చౌటపల్లి నుంచి కొత్తతండాకు వెళ్లే డొంకదారి వెంట చెట్ల పొదల్లో నాటుసారా తయారుచేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులలో రెండు డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు. అదేవిధంగా 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసులు వస్తున్నారని గుర్తించిన సారా తయారీదారులు పారిపోయారన్నారు. దీనిపై విచారణ జరుపుతున్నామన్నారు. నాటుసారా తయారుచేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

భవితకు భరోసా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో

గరిడేపల్లి : తెలంగాణ భవితకు భరోసా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టో విడదుల చేయడాన్ని హర్షిస్తూ సోమవారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్, గుత్తికొండ వెంకటరమణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వీరాంరెడ్డి, శంభిరెడ్డి, పార్థసారధి, రాంసైదులు, గుర్వయ్య, ఇసాక్, జయరాంనాయక్, కృష్ణ, మన్సూర్‌అలీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సెలవు ఇవ్వాలని కార్మికుల వినతి

హుజూర్‌నగర్ : రైస్ మిల్లు కార్మికులకు సంబంధించిన యూనియన్‌ల జనరల్ బాడీ సమావేశం నిర్వహించుకునేందుకు పని దినాల్లోనే ఒకరోజు సెలవు ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పొలిశెట్టి నరసింహారావు, గజ్జి ప్రభాకర్‌లకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పి.ఉపేందర్, ఎస్.శ్రీను, బి.గురవయ్య, మల్లయ్య, కౌన్సిలర్ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి బీఆర్‌ఎస్ అసమ్మతి నేతలు?

అనంతగిరి: బీఆర్‌ఎస్ అసమ్మతినేతలు మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. మంగళవారం ఉదయం అనంతగిరి మండలం శాంతినగర్ శివారులోని ఓ అసమ్మతినేత వ్యవసాయక్షేత్రంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మావతిరెడ్డిల సమక్షంలో ఈ అసమ్మతినేతలంతా పార్టీ కండువా కప్పుకోనున్నట్లు తెలిసింది. వీరిలో ముగ్గురు ఎంపీపీలు, నలుగురు జెడ్పీటీసీ సభ్యులు, ఇద్దరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, డీసీసీబీ మాజీ చైర్మన్‌తో పాటు పలువురు ఇతర నేతలు ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా ఉదయం 12 గంటలకు కోదాడలో జరిగే కార్యక్రమంలో ఓ మాజీ ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిసింది.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : కల్లు గీత పనివారల సంఘం వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కొండా కోటయ్య కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19, 20 తేదీల్లో కల్లుగీత పనివారల సంఘం వార్షికోత్సవం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాలకూరి బాబు, సోమగాని కృష్ణ, సీహెచ్.సాంబయ్య, పెదసాంబయ్య, జి.పాపులు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు


బాణసంచా కాల్చుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

నేరేడుచర్ల : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని భారీ మోజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు అరిబండి సురేష్‌బాబు, సత్యనారాయణరెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా శానంపూడి సైదిరెడ్డికి బీఫాం ఇవ్వడం, బీఆర్‌ఎస్ మేనిఫెస్టో విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం నేరేడుచర్లలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చిత్తలూరి సైదులు, సైదులు, రాజేష్, సైదిరెడ్డి, సుందరయ్య, సుంకు శ్రీనివాస్, అంజయ్య, యాదగిరి, పుష్ప, శేఖర్, శ్రీను, నాగరాజు, జానయ్య, సీతయ్య, సోమిరెడ్డి, నారాయణ, రాములు తదితరులు ఉన్నారు.

సీపీఎం శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

మఠంపల్లి : సూర్యాపేటలో ఈనెల 17, 18 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పాండునాయక్ కోరారు. సోమవారం మఠంపల్లిలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ తరగతుల్లో కేంద్ర, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, నాయకులు సయ్యద్ రన్‌మియా, పాడిశెట్టి రాము, చల్లా చలింగయ్య, వెంకటరెడ్డి, కోటయ్య, వినోద్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై దాడులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని గ్రామాల్లో గల బెల్టు షాపులపై రూరల్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పలువురిని, మద్యం సీసాలను స్టేషన్‌కు తరలించారు. బెల్టుషాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్‌దే విజయం

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


రామాపురంలో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నేరేడుచర్ల : రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంతో పాటు కేంద్రంలోనూ కాంగ్రెస్‌దే విజయమని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలోని రామాపురంలో మాజీ సర్పంచ్ చింతమళ్ల సైదులుతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువాలను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం నల్లగొండ ఎంపీగా ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నానని, మచ్చలేని జీవితాన్ని గడుపుతున్నానని తెలిపారు. హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా తనను మరోసారి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు చెల్లించే పన్నులతోనే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, కేసీఆర్ తన జేబు నుంచి ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదని అన్నారు. దళితులకు మూడేకరాలు భూమి, దళిత బంధు ఎంత మందికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూం ఒకటి కూడా లేదని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కొణతం చిన వెంకట్‌రెడ్డి, నూకల సందీప్‌రెడ్డి, పాలకీడు ఎంపీపీ భూక్యా గోపాల్, కౌన్సిలర్ నాగయ్య, సర్పంచ్ మోతీలాల్, నాయకులు, జ్యోతిబాబు, రవీందర్‌రెడ్డి, మంగయ్య, సురేష్‌రెడ్డి, పాండునాయక్, పిచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

గులాబీ జెండా ఎగరడం ఖాయం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


మునగాల : మాధవరంలో మల్లయ్యయాదవ్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


నడిగూడెం : ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోదాడ : బీఆర్‌ఎస్ నుంచి కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఫాం తీసుకొని తొలిసారి కోదాడకు వచ్చిన ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు కోదాడ పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని బొడ్రాయికి మల్లయ్యయాదవ్ దంపతులు జలాభిషేకం నిర్వహించి, పూజలు చేశారు. అలాగే ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగార్జున సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కోదాడలో గులాబీ జెండా ఎగురువేస్తామన్నారు. కార్యక్రమంలో చింత కవిత, కల్లూరి పద్మజ, వెంపటి మధు, ఇమ్రాన్‌ఖాన్, తుమ్మలపల్లి హాస్కర్, శీలం సైదులు, శివాజీనాయక్, మేదర లలిత, కొండా సైదయ్య, నల్లపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్లయ్యయాదవ్‌కు ఘన స్వాగతం

మునగాల : అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఆదివారం రాత్రి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకుని సోమవారం హైదరాబాద్ నుంచి కోదాడకు వస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు మార్గమధ్యలో కోదాడ నియోజకవర్గ ముఖద్వారమైన మండలంలోని మాధవరం శివారులో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా ఇందిరానగర్, తాడువాయి, మునగాల, బరాఖత్‌గూడెం, ముకుందాపురం, ఆకుపాముల గ్రామాల్లో ఆయనకు కార్యకర్తలు స్వాగతం పలికారు.

బీఆర్‌ఎస్ నాయకుల ర్యాలీ

నడిగూడెం : అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొల్లం మల్లయ్యయాదవ్‌కు సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీఫాం ఇచ్చిన సందర్భంగా సోమవారం నడిగూడెంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, ఎంపీపీ యాతాకుల జ్యోతి, సహకార సంఘం చైర్మన్ పుట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో స్వాతీనక్షత్ర కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి స్వాతీనక్షత్ర కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకార్చనలు, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

యాభై ఏళ్లైనా గురువుని మరవని శిష్యులు


సుందరి కోటేశ్వరరావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : సుమారు 50 ఏళ్ల క్రితం (1975– 78) విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును చూడాలని రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన శిష్యులు తలిచారు. సోమవారం వారంతా కలిసి మండలంలోని పొనుగోడులో నివాసం ఉంటున్న తమ గురువు, రిటైర్డు బాటనీ అధ్యాపకుడు సుందరి కోటేశ్వరరావు వద్దకు చేరుకొని శాలువాలతో సత్కరించి పాదాభివందనం చేసి జ్ఞాపిక అందజేశారు. యాభై ఏళ్లైనా శిష్యులు తనను గుర్తుంచుకొని సత్కరించినందుకు కోటేశ్వరరావు ఉద్వేగంతో ఆనందపరవశులయ్యారు. అయితే శిష్యులందరూ ఉన్నత స్థానాల్లో ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ పొందడం విశేషం. కార్యక్రమానికి హాజరైన శిష్య బృందంలో ఎస్.సత్యనారాయణ డైట్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్, ఉప విద్యాధికారి, సీహెచ్.శంకరాచారి, కట్టా ఎల్లారెడ్డి రిటైర్డు ఎంఈఓలు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన రిటైర్డు ఎంఈఓలు గుండా రమేష్, ప్రభాకర్‌ఆచారి, మరికొందరూ ఉపాధ్యాయ వృత్తిలో రాణించి పదవి విరమణ పొందడం గమనార్హం. అలాగే కోటేశ్వరరావు శిష్యుడైన యూసుఫ్ అలీ మైనార్టీ గురుకులాల ఉప సంచాలకులుగా సేవలందిస్తున్నారు.

గాయత్రీ దేవి అవతారంలో దుర్గామాత

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం దుర్గామాత గాయత్రీ దేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


హుజూర్‌నగర్‌రూరల్ : బూరుగడ్డలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు


హుజూర్‌నగర్: గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు


మఠంపల్లిలో..


గరిడేపల్లి : మంగాపురంలో పూజలు నిర్వహిస్తున్న మాలధారులు, భక్తులు


నేరేడుచర్ల : శివాలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


నేరేడుచర్ల : కనకదుర్గ ఆలయంలో గాయత్రీ దేవికి పూజలు చేస్తున్న భక్తులు